క్లుప్తంగా

తలకోనలో శాస్త్రోక్తంగా పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీసిద్ధేశ్వర స్వామి

భాకరాపేట: తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. సోమవారం వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపారు. అనంతరం అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజా కార్యక్రమం సాగింది. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మాఘ మాసం సమీపిస్తుండడంతో ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. భక్తులకు అర్చకులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ లైవ్లీ హుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్ సెంటర్‌లో ఫిబ్రవరి రెండో వారం నుంచి ప్రారంభం కానున్న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కోసం ఆసక్తిగల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల వ్యవధితో శిక్షణ ఉంటుందని ట్రైనింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన ఆసక్తిగల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 98852 44006 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శ్మశాన సమస్యను పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీ యోగానందరెడ్డి, వేమూరువాసులు

తిరుపతి రూరల్: గ్రామంలోని శ్మశాన సమస్యను పరిష్కరించాలని వేమూరు గ్రామవాసులు కోరారు. ఈ మేరకు ఎంపీటీసీ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి రూరల్ తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా యోగానందరెడ్డి మాట్లాడుతూ ముస్లిం పేటకు శ్మశానం లేకపోవడం, దారి సమస్య కూడా ఉండడంతో దాదాపు 40 ముస్లిం కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని, జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పారన్నారు. మోహిత్‌రెడ్డి సూచనలతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

సినీ కవి వేటూరికి ఘన నివాళి


వేటూరికి నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు, కళాకారులు

తిరుపతి కల్చరల్: సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తికి రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘన నివాళులర్పించారు. వేటూరి జయంతిని పురస్కరించుకొని రంగస్థలి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అందమైన పాటల్ని అలవోకగా రచించడంలో వేటూరి అసాధ్యుడని ఈ సందర్భంగా కొనియాడారు. రంగస్థలి కళాకారులు శాంటోలు హరినాథ, కన్నప్పగారి కేశవరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, చంద్రబాబు, మురళి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చంద్రగిరి: మండల సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మండలంలోని జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో పనులపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ పెంచల కిషోర్, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి

తిరుపతి అర్బన్: స్పర్శ లెప్రసీపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని డీఆర్‌ఓ పెంచల కిషోర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పర్శ లెప్రసీ అవగాహనా కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను జిల్లా రెవెన్యూ అధికారితోపాటు జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ సి.అరుణ సులోచన, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ కిరణ్ నాయక్, డాక్టర్ బి.రాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మంగళవారం నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

పెద్దలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి, మెప్మా మహిళల ఆత్మీయ సమావేశంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి




దేశంలోనే పరిశుభ్ర నగరంగా తిరుపతి

తిరుపతి మంగళం: ప్రపంచం నలుమూలల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సైతం గర్వించేలా, దేశంలోనే తిరుపతిని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దుతామని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, వైఎస్ఆర్ సీపీ తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. పద్మావతి శేషసాయి నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి భూమన అభినయ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 40ఏళ్లల్లో ఎన్నడూ లేనంతగా తిరుపతిని అత్యంత సుందరంగా అభివృద్ధి చేశామని చెప్పారు. శ్రీవారి భక్తులతోపాటు నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తలెత్తకుండా 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మించామన్నారు. 22ఎ రద్దు చేయించి 7వేల మందికి రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. అందరిలా ఎన్నికల ముందు వచ్చి అవి చేస్తా, ఇవి చేస్తానని ప్రగల్భాలు పలకలేదని, అభివృద్ధి చేసి ఓట్లు కోసం ముందుకు వచ్చానన్నారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధిని చూసి తనకు ఓట్లు వేసి గెలిపించాలని భూమన అభినయ్‌రెడ్డి అభ్యర్థించారు. ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీని గెలిపిస్తే తిరుపతి నగరాన్ని క్రైం ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఆకాశగంగ నుండి నాలుగు లేన్ల రోడ్డు


నివేదికను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి

తిరుమల: తిరుమలలోని ఆకాశగంగ నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు రూ.30.71 కోట్లతో టెండరు ఆమోదించినట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుమలలో సోమవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఈ విధంగా ఉన్నాయి.

- తిరుమల అన్నమయ్య భవనం సమావేశ మందిరం ఆధునీకీకరణలో భాగంగా దృశ్యశ్రవణ అనుసంధాన పరికరాల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.
- తిరుమల శ్రీవారి దర్శనానికి దేశవ్యాప్తంగా విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రూ.2.28 కోట్లతో సప్తగిరి సత్రాలు–6, 7 బ్లాకుల అభివృద్ధి పనుల కోసం టెండరు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.
- తిరుమలలోని శ్రీవేంకటేశ్వర, ఆదిశేషు, శంకుమిట్ట విశ్రాంతి గృహాల అభివృద్ధి, పెయింటింగ్ పనుల కోసం రూ.10.90 కోట్లు మంజూరుకు పరిపాలన అనుమతికి ఆమోదం తెలిపారు.
- ఆకాశరాజు నిర్మించిన అతిప్రాచీనమైన నారాయణవనంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారి ఆలయానికి రాజగోపురం, రాతిప్రాకారం నిర్మాణానికి రూ.6.90 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపారు.
- రాష్ట్ర విభజన అనంతరం, ఆంధ్రప్రదేశ్‌లో చిన్నపిల్లలకు ప్రత్యేకించి వైద్యసేవలు అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు తిరుపతి నగరంలో శ్రీవారి పాదాల చెంత శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయడమైనది. భారతదేశంలోనే చిన్నారులకు సంబంధించి ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా ఆవిర్భవించనుంది. ఈ ఆస్పత్రిని ఇకపై శ్రీపద్మావతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్‌గా వ్యవహరించనున్నారు.
- తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన తిరుమల, తిరుపతి మీడియా ప్రతినిధులతో ఏర్పాటైన శ్రీవాణి ట్రస్టు నిజనిర్ధారణ కమిటీ తన నివేదికను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి, ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభం


సదస్సులో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో డీబీటీ బిల్డర్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఆన్ జీనోమిక్స్ అండ్ బయోలాజికల్ డేటా బేసిస్ అనే అంశంపై సోమవారం వర్సిటీలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి హాజరయ్యారు. స్విమ్స్ బయో ఇన్‌ఫర్మేటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, డీన్ ప్రొఫెసర్ సుజాత, ఏపీ ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, ప్రొఫెసర్ ఆర్ ఉషా, డాక్టర్ దీప్తిక్ సతీష్, డాక్టర్ సుదర్శన్ వరదరాజన్, డాక్టర్ పీర, డాక్టర్ స్వామి, శ్రీదేవి, ప్రొఫెసర్ స్వర్ణలతాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బాడీబిల్డింగ్ పోటీలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం యూత్ హాస్టల్లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల క్రీడాకరులకు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఈశ్వరప్రకాష్, శివప్రసాద్ రాయల్ తెలిపారు. ఈమేరకు వారు పోటీలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం జోష్ ప్రాపర్టీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు, మెమెంటోలు, నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

సమాజ శ్రేయస్సుకు దోహదపడాలి


రోగులకు స్టీల్ ప్లేట్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: మానవ సేవే మాధవసే అన్న నానుడిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పిలుపు నిచ్చారు. రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని రష్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం 65వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పదవీ బాధ్యతలు చేపట్టాక మొదటిసారిగా జరుగుతున్న వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి కేక్ కట్ చేసి ఆసుపత్రి నర్సింగ్ కళాశాల విద్యార్థులకు పంచిపెట్టారు. రోగులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, క్లాత్ మర్చంట్ అసోసియేషన్, తిరుపతి ఫిలిం ఛాంబర్, బ్రాహ్మణ సంక్షేమ సంఘం నేతలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులు హాజరై డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రష్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చంద్రకుమార్, కృష్ణకాంత్, పవన్ కుమార్, సుమంత్, శివకుమార లీలావతి, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రుయా పారిశుధ్య కార్మికుల ధర్నా


రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభుకు సమస్యలు వివరిస్తున్న పారిశుధ్య కార్మికులు

తిరుపతి ఎడ్యుకేషన్: రుయా ఆసుపత్రిలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులు సోమవారం సాయంత్రం ఆసుపత్రి ఆవరణలో ధర్నా నిర్వహించారు. కార్మికులు సులోచన, లీలావతి, నాగిని, కిరణ్‌కుమారి, కుంటెమ్మ మాట్లాడుతూ రుయా ఆసుపత్రిలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికుల సేవలను గుర్తించడం లేదని, రిపబ్లిక్ డే రోజు సేవా పతకం ఇవ్వలేదని వాపోయారు. అలాగే ఆసుపత్రి సెక్యూరిటీ సూపర్ వైజర్ మహేంద్ర మహిళా కార్మికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. జీతాలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా వద్దకు చేరుకున్న సూపరిటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ఏఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణలకు కార్మికులు తమ డిమాండ్లను విన్నవించారు. దీనిపై వారు స్పందిస్తూ సెక్యూరిటీ సూపర్‌వైజర్ మహేంద్రపై చర్యలు తీసుకుంటామని, కార్మికుల జీతాలకు సంబంధించిన బిల్లులను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు. 150మందికి పైగా మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఆగని కాలువ ఆక్రమణ

- నిర్మాణాలను అడ్డుకున్న స్థానికులు


కాలువపై అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్న ప్రజలు

చంద్రగిరి: ద్వారక నగర్‌లో కాలువను ఆక్రమించి అక్రమ నిర్మాణాలను చేపట్టడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను అడ్డుకుని ఆక్రమణదారులతో వాగ్వాదానికి దిగిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చంద్రగిరి లెక్కదాఖల సర్వే నంబరు 143లో 2 ఎకరాలకు పైగా కాలువ పోరంబోకు ఉంది. భారీ వర్షాలు కురిస్తే రాయలవారి కోట పైభాగాన ఉన్న కొండ ప్రాంతాల నుంచి వర్షపు నీరు ఈ మార్గం ద్వారా చంద్రగిరికి చేరుకుంటుంది. ఈ క్రమంలో తిరుపతి రూరల్ మండలం సీ.మల్లవరానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూమి తనేదనేంటూ ఈ నెల 10వ తేదీన నిర్మాణాలను ప్రారంభించారు. దీంతో అప్పట్లో రెవెన్యూ అధికారులు పనులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో మరోమారు సోమవారం ప్రహరీ నిర్మాణానికి పూనుకోవడంతో స్థానికులు అక్కడకు చేరుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. స్థానికులు 100కి ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాత్కాలికంగా నిర్మాణ పనులను ఆపివేశారు. బాధితుడు ఇమాం సాహెబ్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు స్పందించి కాలువతో పాటు రోడ్డును ఆక్రమణదారుల నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి వైద్యశిబిరం వివరాలను వెల్లడిస్తున్న ఎన్ఆర్ఐ మల్లం మోహన్ దంపతులు

చంద్రగిరి: నాలుగు రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వస్తోందని ప్రవాస భారతీయుడు మల్లం మోహన్, పద్మ దంపతులు అన్నారు. మండల పరిధిలోని తొండవాడ పంచాయతీ కేంద్రంలో మల్లం మోహన్, చెన్నై శంకర నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈ నెల 26 నుంచి కంటికి సంబంధించిన సమస్యలకు ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 300 మంది కంటి పరీక్షలు చేసుకున్నారని, వారిలో 46 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్సలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశామన్నారు. సర్పంచ్ మల్లం దీపిక రెడ్డి, ఉప సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

గడప గడపలో ఆత్మీయతానందం


నరసింగాపురంలో దళితవాడలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి ఘన స్వాగతం

- అడుగడుగునా హారతులతో అపూర్వ స్వాగతం
- చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి సాదర స్వాగతం

చంద్రగిరి: జగనన్న ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన అభివృద్ధి పనులపై గడప గడపలో ఆనందం వెల్లివిరిసింది. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన వారంతా సంక్షేమ సారథికే మరోసారి పట్టం కడుతామంటూ స్పష్టం చేశారు. కరోనా సమయంలో చెవిరెడ్డి చేసిన మేలు జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని, వచ్చే ఎన్నికల్లో చంద్రగిరిలో ఆయన బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరిస్తామంటూ గ్రామస్తులు హామీ ఇచ్చారు. మండల పరిధిలోని నరశింగాపురం పంచాయతీ పరిధిలో సోమవారం ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డితో కలసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నిర్వహించారు. ముందుగా గ్రామంలోని గ్రామ దేవతలకు పూజ చేసిన తరువాత ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారుల సంక్షేమ జాబితాను అందించారు. ఆ తర్వాత గ్రామంలో చేసిన ప్రగతి పనులను వివరిస్తూ ఇంకా ఏదైనా చేయాల్సిన పనులు ఉంటే వాటిని తన వెంట తెచ్చుకున్న పుస్తకంలో రాసుకుని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. చంద్రగిరి ఎంపీడీవో బాలాజీ నాయక్‌తోపాటు పలువురు ప్రభుత్వ అధికారులు కూడా ఆ కార్యక్రమంలో పాల్గొని, చిన్నపాటి సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రాజేంద్రప్రసాద్(పెదబాబు), ఎంపీటీసీ అశ్విని ప్రవీణ్ కుమార్ స్వాగత ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో చేసిన ప్రగతి పనులు యథావిధిగా కొనసాగాలంటే తన అన్నయ్య చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదరించాలని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గ్రామస్తులకు విన్నవించారు. సర్పంచ్ చెంచురత్నం శెట్టి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పసల నాగరాజు, వెంకటమునిరెడ్డి, ప్రకాష్ రెడ్డి, కొత్తపాటి హరి, సుబ్రమణ్యం, మస్తాన్, సీఎం కేశవులు పాల్గొన్నారు.

జగనన్నది జనరంజక పాలన

- 99 శాతం హామీల అమలు
- గాంధీపురంలో చెవిరెడ్డి లక్ష్మికి అపూర్వ ఆదరణ


గాంధీపురం పంచాయతీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: జనరంజక పాలనతో జగనన్న సంక్షేమ ఫలాల్ని ప్రజల చెంతకు చేర్చారని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో సర్పంచ్ మున్నూరు లక్ష్మిశివ ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు మంగళ హారతులు, భారీ బాణాసంచా మోతలతో అపూర్వ స్వాగతం పలికారు. గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి పని పూర్తి చేసిన తొలి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ దేశంలోనే రికార్డు సృష్టించారని తెలిపారు. సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని కోరారు. ఉన్నత చదువులు చదివి, ప్రజాసేవపై మక్కువతో ఉన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆదరించాలని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మున్నూరు లక్ష్మిశివ, లక్ష్మిసెల్వం, ఎంపీటీసీ జయకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టండి

- దేవరకొండలో పల్లెబాట ప్రారంభం
- ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించండి
- బ్రహ్మారథం పట్టిన దేవరకొండ ప్రజలు


మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని అభ్యర్థిస్తున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, చెవిరెడ్డి ఆకాష్‌రెడ్డి

భాకరాపేట: సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, చెవిరెడ్డి ఆకాష్‌రెడ్డి కోరారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీలో సోమవారం వారు పల్లెబాట కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. గొల్లపల్లె కాలనీలో మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జగనన్న సంక్షేమం, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేస్తూ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని అభ్యర్థించారు. దేవరకొండ పంచాయతీలోని గొల్లపల్లె, వంగుమల్లువారిపల్లె, కొత్తపల్లె, వెంకటేశ్వర పురం, మల్లెలవాండ్లపల్లె, మైలావాండ్లపల్లె, మాదిగపల్లె, దూదివాండ్లపల్లె, గుట్టావాండ్లపల్లె గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ స్వరూప, గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్, వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గురుశంకర్, ఉమామహేశ్వర్‌రెడ్డి, అక్బర్, మాజీ సర్పంచ్ సుధాకర్, మాజీ ఎంపీటీసీ గిరి, నాయకులు శివకుమార్, చంటి, మాజీ సర్పంచ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే ఖబడ్దార్


మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు

తిరుపతి కల్చరల్: జెడ్పీటీసీగా ఉన్న వ్యక్తిని ఎమ్మెల్యే గుర్తింపు కల్పించిన పార్టీని, మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే అర్హత కోనేటి ఆదిమూలానికి లేదని, నిందారోపణలు చేస్తే చూస్తూ ఊరుకోం ఖబడ్దార్ అంటూ వైఎస్ఆర్ సీపీ దళిత విభాగం నేతలు హెచ్చరించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు మధు మంత్రి పెద్దిరెడ్డిపై కోనేటి ఆదిమూలం చేసిన నిందారోపణలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అనేక సంక్షేమ ఫలాలతో పాటు నామినేటెడ్ పదవుల్లో సైతం సముచిత స్థానం కల్పిస్తూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేశారన్నారు. ఆదిమూలం తన సొంత అజెండాతో ఇటు ప్రభుత్వంపై ఇటు మంత్రి పెద్దిరెడ్డిపై నిందారోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్, దళిత, గిరిజన విభాగం నేతలు మునీంద్ర నాయక్, వెంకటస్వామి, చిన్నారాయుడు, జయశంకర్, సీతాపతి, రత్న కిషోర్, కుప్పయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.


సంత ప్రజలకు భోజనాలు వడ్డిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

వారపు సంతలో భోజన సౌకర్యం

పాకాల: ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో రైతులకు, వ్యాపారులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉచితంగా భోజనాలను సరఫరా చేశారు. సోమవారం స్థానిక నాయకుల చేతుల మీదుగా భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు, సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారస్తులు భోజనాలకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో భోజనాలను సరఫరా చేస్తున్నారని వివరించారు.

కేకేవీపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

రామచంద్రాపురం: మండలంలోని కేకేవీపురం పంచాయతీ మహంతువారిపల్లి, సెవాయికాల్వ, సెవాయికాల్వ దళితవాడ, జీకేఎస్ కండ్రిగ, పాపారెడ్డికండ్రిగ గ్రామాల్లో మండల ఇన్‌చార్జి నల్లందుల సుధాకర్‌రెడ్డి గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రతి ఇంటి గడపలోనూ మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అందరినీ ఒకేలా చూసి సంక్షేమం, అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించి గెలిపించాలని కోరారు. వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, భానుకుమార్‌రెడ్డి, గణపతి నాయుడు, భాస్కర్‌రెడ్డి, బాబుయాదవ్, మహేంద్రారెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేష్, మునీంద్ర యాదవ్, నాయకులు శేషాద్రిరెడ్డి, భాస్కర్ యాదవ్, చంద్రబాబు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల జాబితా అందిస్తున్న మండల ఇన్‌చార్జి నల్లందుల సుధాకర్‌రెడ్డి